
సాక్షి ఒడిశా
శుక్రవారం । 10 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,63,295లు, బంగారం 2 గ్రాముల 780 మిల్లీ గ్రాములు, వెండి 50 గ్రాముల 400 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఆపదలు తీర్చేతల్లి.. అగ్ని గంగమ్మ

- 8లో▸

శిక్షణలో గాయపడిన ఎస్‌వోజీ జవాన్

భువనేశ్వర్: నగర శివారు చందక ప్రాంతపు శిక్షణ శిబిరంలో గురువారం అపశృతి చోటు చేసుకుంది. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్‌ఓజీ) జవాన్ గాయపడ్డాడు. చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. జవాను బుల్లెట్‌తో గాయపడినట్లు అధికార వర్గాలు తెలిపాయి. జవాను ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పేర్కొన్నాయి.

అగ్ని కీలలు

- మార్కెట్ కాంప్లెక్స్‌లో మంటలు
- భయాందోళన చెందిన పర్యాటకులు
- మంటలు అదుపు చేయడానికి 20 గంటల సమయం
- తీవ్రంగా ఆస్తినష్టం



అగ్ని ప్రమాదంలో పూరీ సామ్రాట్ మార్కెట్ కాంప్లెక్స్

భువనేశ్వర్: పూరీ టౌన్ ఠాణా మారీచ్ కోట్‌వీధి లక్ష్మీ బజార్‌లోని సామ్రాట్ మార్కెట్ కాంప్లెక్స్‌లో బుధవారం రాత్రి మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాదంతో గురువారం సాయంత్రం వరకు ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకున్నాయి. అగ్నిమాపక దళం నిరంతరం శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. అయితే ఆస్తి నష్టం భారీగా ఉండవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

తప్పిన ప్రాణనష్టం

అగ్నిమాపక దళం సిబ్బంది సమయస్ఫూర్తితో పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన యాత్రికులను సురక్షితంగా సకాలంలో బయటకు తీసుకొచ్చారు. మంటల్లో చిక్కుకొని స్వల్ప అస్వస్థతకు గురైన ముగ్గురు పర్యాటకులను సత్వర చికిత్స కోసం పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. మార్కెట్ ఆవరణలో పలు దుకాణాలు దగ్ధమయ్యాయి.

భారీగా అగ్నిమాపక దళాలు

సమయం పెరుగుతున్నా మంటల అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక దళాలను అధిక సంఖ్యలో రప్పించారు. స్థానిక బలగాలతో పాటు భువనేశ్వర్, ఖుర్ధా, సాక్షి గోపాల్ ప్రాంతాల నుంచి వచ్చిన అగ్నిమాపక బృందాలను మంటల నివారణలో నియమించారు. ప్రభుత్వ అదనపు కార్యదర్శి, ప్రత్యేక సహాయ కమిషనర్ నికుంజ బిహారీ ధొలొ ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదంలో ప్రభావితమైన హోటల్ నుంచి పూణే, నాసిక్ ప్రాంతాల నుంచి విచ్చేసిన 133 మంది యాత్రికులకు మోచి సాహి కల్యాణ మండప్‌లో తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. పూరీ జిల్లా అధికార యంత్రాంగం ఈ కార్యకలాపాలు పర్యవేక్షించింది.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు: అగ్నిమాపక శాఖ డీజీ

పూరీ సామ్రాట్ మార్కెట్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ సంతోష్ ఉపాధ్యాయ్ స్పందించారు. 12 అగ్నిమాపక వాహనాలతో 160 మందికి పైగా సిబ్బంది మంటలు అదుపు చేయడంతో శ్రమించారని తెలియజేశారు. ఆధునిక పరికరాల సాయంతో అగ్నిమాపక దళం మంటలను ఆర్పే పనిలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కటక్ ఫైర్ ఆఫీసర్ రమేష్ చంద్ర మాఝీ ఆధ్వర్యంలో మంటల నివారణ ప్రక్రియ చేపట్టారు. డీఐజీ ఘటనా స్థలాన్ని ప్రత్యక్షంగా సందర్శించి క్షేత్ర స్థాయిలో స్థితిగతులను ప్రాథమికంగా సమీక్షించారు. రాత్రి చీకటిగా ఉండడం, దుకాణాల షట్టర్ మూసి వేయడం వలన మంటల నివారణ ప్రక్రియకు ఇబ్బందులు కలిగాయి. దుస్తుల దుకాణాలు, ప్లాస్టిక్ సామాగ్రి ఉండడంతో మంటల విస్తరణ ఊపందుకుంటుండడంతో ఆర్పడంలో జాప్యం జరిగిందని తెలిపారు.

తుది నివేదికతో నష్టం అంచనా: ప్రమీల మల్లిక్

పూరీలోని మార్కెట్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి ప్రమీల మల్లిక్ స్పందించారు. ఈ ఘటనపై ప్రభుత్వం నిఘా కొనసాగుతోందన్నారు. అధికారులు ఘటన స్థలంలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. తుది నివేదిక తర్వాత ప్రమాద నష్టం అంచనా చేపడతామని ఆమె వివరించారు.

ఆపత్కాలంలో చేయూత

మహారాష్ట్ర నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజీకి చెందిన ప్రత్యేక బృందం ఘటనా స్థలానికి చేరి మంటల నివారణలో అదనపు సహాయం అందజేసింది. నగరంలో కొనసాగుతున్న జాతీయ అగ్ని మాపక శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఈ బృందం విపత్కర పరిస్థితుల్లో చేయూతనివ్వడం విశేషం.

కాంగ్రెసు నేత పెదవి విరుపు

పూరీ మార్కెట్ కాంప్లెక్సులో చెలరేగిన మంటలు పొద్దెక్కినా అదుపులోకి రాలేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే నర్సింహ మిశ్రా పెదవి విరిచారు. 20 గంటలకు పైగా మంటలు అదుపులోకి రాలేదు. సైన్స్ అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో అగ్నిని అదుపు చేయలేకపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యానికి ఈ సంఘటన నిలువునా అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు.

భద్రతకు ప్రాధాన్యం

పూరీ అగ్ని ప్రమాదంలో ప్రాణహాని లేకుండా, ఆస్తి భద్రత దిశలో మంటల నివారణ కార్యకలాపాలు చేపట్టినట్లు రాష్ట్ర హోం శాఖ సహాయ మంత్రి తుషార్ కాంతి బెహరా తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాల్లో పాల్గొన్న యంత్రాంగం మంటల నివారణతో ప్రాణ, ఆస్తి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. బాధితులకు వసతి, భోజనం వంటి మౌలిక సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. మంటల్లో చిక్కుకున్న భవనం పునరుద్ధరణ, జీవనోపాధి ప్రభావిత కార్మిక వర్గాల సంక్షేమ చర్యలు చేపడతామని వెల్లడించారు.



ఆశ్రయ కేంద్రంలో ఉన్న బాధితులు



బాధితులతో మాట్లాడుతున్న రాష్ట్ర హోం శాఖ సహాయ మంత్రి తుషార్ కాంతి బెహరా



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక దళాలు



ప్రమాద స్థలంలో జన సందోహం

న్యూస్‌రీల్

కటక్‌కు తరలింపు

- గూఢచారి పావురంపై దర్యాప్తు ముమ్మరం



గూఢచారి పావురం

భువనేశ్వర్: జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ మెరైన్ ఠాణా పోలీసులు స్వాధీనం చేసుకున్న గూఢచారి పావురాన్ని కటక్‌లోని రాష్ట్ర పోలీసుల పావురం, డాగ్ స్క్వాడ్‌కు గురువారం తరలించారు. దాని కాళ్లకు ఉన్నటువంటి మినీ కెమెరా, మైక్రోచిప్ పరీక్షల కోసం భువనేశ్వర్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ లాబొరేటరీ (ఎస్‌ఎఫ్‌ఎల్)కి సిఫారసు చేశారు. ఈ పావురం రెక్కలపై అర్థం కాని సందేశాలను సైతం ఈ వర్గాలు పరీక్షిస్తాయి. సుమారు 10 రోజుల క్రితం పూరీ జిల్లా కోణార్క్ చంద్రభాగ తీరంలో సముద్రం మధ్యలో ఫిషింగ్ ట్రాలర్ సారథిపై పావురం వాలింది. పారాదీప్ మెరైన్ ఠాణా పోలీసులకు దీనిని బుధవారం అప్పగించిన విషయం తెలిసిందే. దీనికి అమర్చిన గాడ్జెట్‌లు గూఢచర్యం కోసం ఉద్దేశించినవేనా అని నిర్ధారించుకోవడానికి పరీక్షల కోసం పంపించారు. మత్స్యకారులు చేజిక్కించుకున్న పావురం గూఢచర్యం కోసం శిక్షణ పొందిదా లేదనే విషయం పావురం, డాగ్ స్క్వాడ్ నిపుణులు పరిశీలిస్తారు. దీని రెక్కలపై రాసి ఉన్న అర్థం కాని రాతలో స్పష్టత లేకపోవడంతో నిపుణుల సహాయం తీసుకుంటామని జగత్‌సింగ్ పూర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పి.ఆర్.రాహుల్ తెలిపారు. అయితే ఈ ప్రాంతంలో గూఢచారి పావురం లభించడంతో సర్వత్రా భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ వర్గాలు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నాయి.

గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితుడు రామ్‌చంద్ర

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎక్సైజ్ అధికారులకు బలిమెల పోలీసుస్టేషన్ పరిధి దవుడగూడ గ్రామంలోని ఒక వ్యక్తి, తన ఇంటిలో గంజాయి ఉంచి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో అతని ఇంటిపై బుధవారం రాత్రి దాడిచేసి మూడు క్వింటాళ్ల 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దవుడగూడ గ్రామానికి చెందిన రామచంద్ర హంతాల్ చిత్రకొండ ప్రాంతంలో తక్కువ ధరకు గంజాయి కొని ఇతర రాష్ట్రాల్లో అధిక ధరలకు విక్రయిస్తాడని పోలీసులు పేర్కొన్నారు. దీంతో రామచంద్ర ఇంటిపై దాడిచేసి గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు అరెస్టు చేశారు. గురువారం అతడిని కోర్టులో హాజరు పరిచారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.45 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు రావాలి

- సెంచూరియన్ వర్సిటీలో ముగిసిన ఎంటర్‌ప్రెన్యూర్ వీక్



ముగింపు సమావేశంలో పాల్గొన్న ఎంపీ చంద్రశేఖర సాహు, కలెక్టర్ లింగరాజ్ పండా తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు రావాలని బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి పారిశ్రామికవేత్తల ఎంటర్‌ప్రెన్యూర్ వీక్ గురువారంతో ముగిసింది. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముద్ర రుణం, పీఎంఈజీపీ, నిరుద్యోగ యువత కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ లింగరాజ్ పండా, సెంచూరియన్ వర్సిటీ డీన్(అకాడమిక్)డా.అనితా పాత్రో, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సునారాం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీజేపీ శ్రేణులు



పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: జయపురం విధానసభ నియోజకవర్గంలో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. జయపురంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా బీజేపీ మీడియా కో–ఆర్డినేటర్ సంజయ బెహర, జయపురం పట్టణ బీజేపీ కార్యదర్శి చిన్మయి పాయికరాయ్, జయపురం సమితి బ్లాక్ అధ్యక్షుడు నరసింగ నాయిక్, జయపురం పట్టణ బీజేపీ నేతలు సంతోష్ సామంతరాయ్, పింకి మహాపాత్రో తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరిందరికీ ఎమ్మెల్యే బాహిణీపతి కాంగ్రెస్ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన చిన్మయ పాయికరాయ్, నరసింగ నాయిక్‌లు మాట్లాడుతూ ఎమ్మెల్యే చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులమై కాంగ్రెస్ చేరినట్లు తెలియజేశారు. ప్రజా సమస్యలపై ఆయన నిలదీసిన తీరుతో నమ్మకం కలిగిందన్నారు. ఇక నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి, జయపురం అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు దేవేంద్ర బాహిణీపతి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకాంత పట్నాయిక్, సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణ పాఢీ, జయపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత కుమార్ నాయిక్, సాధూచరణ్ దాస్ చౌధరి, పిల్లు మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఇంటిలో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు మాయం



దర్యాప్తు చేస్తున్న పోలీసులు



బీరువా పగలుగొట్టిన దృశ్యం



చిందరవందరగా పడివున్న దుస్తులు

బరంపురం: నగరానికి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న రళవా గ్రామంలోని బాలకృష్ణ సాహు ఇంటిలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఐఐసీ అధికారి వివేకనంద మోహంతి తెలిపిన వివరాల మేరకు.. బాలకృష్ణ సాహు ఇంటిలో ఎవరూ లేకపోవడంతో దొంగలు తాళాలు పగలుగొట్టి అర్ధరాత్రి ఇంటిలోకి చొరబడ్డారు. ఇంటిలో విలువైన బంగారం ఆభరణాలు, నగదు దోచుకొని పరారయ్యారు.. సమాచారం అందుకున్న గోళంతరా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సాయంతో దర్యాప్తు చేపట్టారు. రళవా గ్రామంలో ఉన్న సీసీ కెమేరాల్లో దుండగులు ఎటువైపు వెళ్లారు అనేది పరిశీలిస్తున్నారు.

ముగిసిన నామినేషన్లు



సమావేశమైన న్యాయవాదులు

బరంపురం: ఈనెల 25వ తేదీన జరగనున్న గంజాం బార్ న్యాయవాదుల సంఘం 2023–24 ఎన్నికల నామినేషన్ల ఘటం గురువారం మధ్యాహ్నంతో ముగింది. సంఘం కార్యాలయంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సహాయ కార్యదర్శి పదవుల కోసం ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది అక్షయ్ పట్నాయక్‌కి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఎన్నికల అధికార బృందం నామినేషన్లు పరిశీలించి అధ్యక్ష పదవికి ఆరుగురు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, కార్యదర్శి పదవికి ఆరుగురు, సహాయ కార్యదర్శి పదవికి ముగ్గురు బరిలో ఉన్నట్లు వెల్లడించారు. 11వ తేదీన స్క్రూట్నీ, 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 15వ తేదీన బరిలో అభ్యర్థుల ప్రకటన జరగనుంది. 25వ తేదీన ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల ఎన్నికల జరగనున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అనంతరం విజేతలను ప్రకటించనున్నారు.

పథకాలపై సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గజపతి జిల్లాలో 5టీ ఆత్మా ఆస్పత్రులు, రోడ్డు భద్రతా, జాతీయ పొగాకు నివారణ ప్రోగ్రాం, బయో మెడికల్ వేస్ట్, రోగి కల్యాణ సమితి, ఆర్‌బీఎస్‌కే, ఆర్‌కేఎస్‌కే తదితర కేంద్ర, రాష్ట్ర పథకాల అమలుపై కలెక్టర్ లింగరాజ్ పండా గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మరో యాభై పడకల ప్రసూతి వార్డు పనులను త్వరితగతిని పూర్తిచేయాలని సీడీఎంవో డా.పాత్రోను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో, జిల్లా ప్రోగ్రామ్ మేనేజరు (ప్రభుత్వ ఆస్పత్రి) సామ్యరాణి గౌడో, అదనపు ఎస్పీ బామదేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు అమలు చేయడం ముఖ్యం




మాట్లాడుతున్న వీసీ గీతాంజలీ దాస్ తదితరులు

- వీసీ గీతాంజలీ దాస్

బరంపురం: మహిళల రక్షణకు ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు అమలు చేయడం ముఖ్యమని బరంపురం యూనివర్సిటీ వీసీ గీతాంజలీ దాస్ అన్నారు. గురువారం బంజవిహార్ సెనేట్ హాల్‌లో బరంపురం వర్సిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాలతో రాష్ట్రంలో 'స్వయంసిద్ధి' (ఉమెన్స్ ఎంపవర్‌మెంట్) పథకం ప్రారంభించడం గర్వకారణమన్నారు. 1990లో అప్పటి సీఎం బిజూ పట్నాయక్ దేశంలోనే మొట్టమొదటి సారిగా ఒడిశాలో 50 శాతం మహిళలకు పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించి రికార్డు సృష్టించారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సైతం మున్సిపల్ ఎన్నికల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించి పెద్దపీట వేశారన్నారు. 'స్వయంసిద్ధి' ద్వారా గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక దాడులు, అత్యాచారాలను అరికట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో మహిళల సంఖ్య తగ్గిపోతుండడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మహిళా చట్టాలపై కళాశాలలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో చైతన్య శిబిరాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రొఫెసర్స్, వైద్యులు, రచయితలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెట్రిక్ పరీక్షలు

- నోడల్ కేంద్రాల భద్రతలో ప్రశ్న పత్రాలు
- ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం



భువనేశ్వర్: రాష్ట్ర వార్షిక హైస్కూల్ సర్టిఫికేట్ (హెచ్‌ఎస్‌సీ), మాధ్యమ, స్టేట్ ఓపెన్ స్కూల్ సర్టిఫికేట్ (ఎస్‌ఓఎస్‌సీ) పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. ఈ పరీక్షలు ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 3,218 కేంద్రాల్లో మొత్తం 5,41,247 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న పత్రాలకు పటిష్ట భద్రత

ఈ పరీక్షల ప్రశ్నాపత్రాలను 316 నోడల్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంచినట్లు రాష్ట్ర పాఠశాల మరియు సామూహిక విద్యాశాఖ మంత్రి సమీర్ రంజన్ దాస్ గురువారం మీడియాకు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ప్రశ్న, జవాబు పత్రాలను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్తారని వివరించారు. నిత్యం ఉదయం 6.00 నుంచి 7.00 గంటల మధ్య ప్రశ్నపత్రాలు పరీక్షా కేంద్రాలకు చేరుతాయి. నోడల్ కేంద్రాల నుంచి పోలీసు బృందాలు ఎస్కార్ట్‌తో ప్రశ్న పత్రాలను తరలించేందుకు డిస్పాచ్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్‌ఈ) ప్రెసిడెంట్ రమాషిస్ హజ్రా తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా సూచనల మేరకు జిల్లా పరిపాలన యంత్రాంగం వాహనం అదనంగా వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.

సీసీటీవీ నిఘా

ఈ ఏడాది పరీక్షల్లో మాస్ కాపీయింగ్ అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి దాస్ తెలిపారు. ఎండ తీవ్రతని దృష్టిలో ఉంచుకొని అన్ని పరీక్షలూ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7.00 గంటలలోపు పరీక్ష రాసే అభ్యర్థులు సంబంధిత కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు మొత్తం 57 సెంట్రల్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయగా, అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీలను ఉంచారు.

క్లుప్తంగా

డిప్యూటీ స్పీకర్ కోలగట్లను కలిసిన అవనాపు విక్రమ్



డిప్యూటీ స్పీకర్ కోలగట్లతో అవనాపు విక్రమ్

విజయనగరం: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వైఎస్ఆర్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీర భద్రస్వామిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలగట్లకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు సంకురభుక్త నాగేశ్వరరావు, ముని లక్ష్మణ్ రావు, ఎర్నింటి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌పై దర్యాప్తు



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీవో చంద్రమ్మ

మక్కువ: మండలంలోని పనసభద్ర సచివాలయం వలంటీర్‌పై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌డీవో చంద్రమ్మ గురువారం దర్యాప్తు నిర్వహించారు. గ్రామానికి చెందిన వలంటీర్ భవాని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తహసీల్దార్, ఎస్సైపై దురుసుగా ప్రవర్తించారన్న విషయంపై గతంలో ఎంపీడీవోకు పలుమార్లు ఫిర్యాదులు రావడంతో, ఆమెకు మెమో జారీ చేశారు. అయినప్పటికీ పనితీరు మెరుగుపడకపోవడంతో వలంటీర్ విధుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో తనను అన్యాయంగా విధుల నుంచి తొలగించారంటూ వలంటీర్ భవాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు నిర్వహించాలని డీఎల్‌డీవో చంద్రమ్మను కలెక్టర్ ఆదేశించడంతో, ఆమె పనసభద్ర సచివాలయానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తానని ఆమె చెప్పారు, కార్యక్రమంలో ఎంపీడీవో దేవకుమార్, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎస్సై పైడిరాజు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

సాలూరు: మండలంలోని చీపురువలస సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సాలూరు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి గురువారం తెలిపారు. వారి దగ్గర నుంచి రూ.35,690, నాలుగు బైక్‌లు, ఐదు మొబైల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

14 నుంచి మహిళలకు క్రీడలు

పార్వతీపురం టౌన్: ఈ నెల 14 నుంచి మహిళలకు క్రీడలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకుడు ఎస్.వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ సూచనల మేరకు ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన నిర్వహించాల్సిన మహిళా క్రీడలు కొన్ని కారణాల వల్ల 14న నిర్వహిస్తామన్నారు. కావున ఔత్సాహిక క్రీడామహిళలు గమనించి పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిర్వహించనున్న క్రీడల వివరాలు ఇలా..

- 14, 15 తేదీల్లో వివిధ సంస్థల ద్వారా యోగా నిర్వహణ
- 16వ తేదీ మాస్ యోగా నిర్వహణ (ఆర్‌సీఎం స్కూల్, పార్వతీపురం)
- 17వ తేదీ బాడ్మింటన్ క్రీడా పోటీలు (ఇండోర్ స్టేడియం, పార్వతీపురం)
- 22వ తేదీ వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు
- 25వ తేదీ క్రీడా పరుగు, మహిళా క్రీడాకారిణులకు సన్మానం (ఆర్‌సీఎం స్కూల్, పార్వతీపురం)

తాగునీటి కోసం తహతహ



ఘనసర వద్ద తోట బయటకు వస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని మనుమకొండ వద్ద తిష్ఠ వేసిన 6 ఏనుగుల గుంపు, ఘనసర వద్ద మకాం పెట్టిన 4 ఏనుగులు గురువారం సాయంత్రం వేర్వేరుగా బయటకు వచ్చాయి. రెండు గుంపులు తాగునీరు కోసం తహతహలాడుతున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. పగటి వాతావరణం చల్లబడగానే తోటలు విడిచి నీటి కోసం వంశధార నదీతీరానికి పయనమవుతున్నాయి. ఈ నీటి వేటలో దారిలోని పచ్చని పంటలను ఏనుగుల గుంపు తింటూ.. మట్టేస్తూ నాశనం చేస్తున్నాయి. కనిపించే వ్యవసాయ బోర్లు, పైపులు పీకి వాటిలోని నీటిని తాగుతున్నాయి. మనుమకొండ వద్ద ఉన్న ఆరు ఏనుగుల గుంపు గురువారం మూడు కిలోమీటర్ల దూరంలోని వంశధార నదికి వచ్చి నీరు తాగి వెనుదిరిగాయని రైతులు చెబుతున్నారు. ఘనసర వద్ద ఏనుగుల గుంపు కూడా తాగునీటి కోసం వెదుకులాట ఆరంభించింది.

ఆపదలు తీర్చేతల్లి.. అగ్ని గంగమ్మ

- నీలావడిలో వైభవంగా జాతర ప్రారంభం
- 9 రోజులు పాటు ఉత్సవాలు



పూజలందుకుంటున్న అగ్ని గంగమ్మ తల్లి



పూజలందుకుంటున్న అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు



కొత్తగా నిర్మించిన ప్రవేశ ద్వారం



అమ్మవారి మందిరం



అమ్మవారికి అన్నభోగాలు



పూజా సామగ్రి విక్రయాలు

రాయగడ: ఉత్కళాంధ్రుల కల్పవల్లి, నీలావడి గ్రామంలో వెలసిన అగ్ని గంగమ్మ తల్లి వార్షిక జాతర గురువారం నుంచి ప్రారంభమైంది. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలు ఈనెల 15వ తేదీతో ముగుస్తాయి. కరోనా కారణంగా రెండేళ్లుగా జాతర నిర్వహించలేదు, దీంతో ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది.

రూ.15 లక్షలతో ఉత్సవాలు

ఈ ఏడాది అమ్మవారి జాతర కోసం సుమారు రూ.15 లక్షలు వెచ్చించేందుకు కమిటీ నిర్ణయించినట్లు అగ్ని గంగమ్మ పూజా కమిటీ అధ్యక్షుడు బి.సత్యంనాయుడు తెలియజేశారు. పూజా కార్యక్రమాలు, భక్తులకు సౌకర్యాలు కల్పించడం కోసం ఖర్చు చేసినట్లు వివరించారు. ప్రతీ ఏడాది అమ్మవారి ప్రసాదం విక్రయాల కోసం టెండర్లను అహ్వానిస్తామని, దీనిలో భాగంగా ఈసారి లడ్డు, పులిహోరా ప్రసాదాల టెండర్లతో రూ.1.52 లక్షలు, అమ్మవారి ఫొటోలు విక్రయించేందుకు అదనంగా మరో రూ.35 వేల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. మిగతా అమ్మవారి కానుకల రూపంలో వచ్చే ఆదాయంలో కొంత మొత్తం ఉత్సవాల కోసం ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. 2020లో జరిగిన అమ్మవారి జాతరలో రూ.20 లక్షల వరకు ఆదాయం లభించిందని, ఈ ఏడాది దానికంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

ప్రభుత్వం నుంచి రూ.కోటి మంజూరు

అమ్మవారి ప్రాచుర్యానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది అమ్మవారి మందిర అభివృద్ధి కోసం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో భక్తులకు విశ్రాంతి గదులు, క్యూ లైన్‌ల నిర్మాణం, మందిరం చుట్టూ ప్రహరీ గోడ, మందిరం ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్క్ ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు.

3 లక్షల మంది వచ్చే అవకాశం

అమ్మవారి ఉత్సవాల్లో శని, ఆది, సోమ, మంగళ, బుధవారాలు ముఖ్యమైనవి. ఈ రోజుల్లో దాదాపు మూడు లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని కమిటీ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వసతి తదితర మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు సన్నాహాలు చేసింది. ఉత్సవాలను తిలకించేందుకు ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

స్థల పురాణం

ఒడిశా రాష్ట్రంలోని జైపూర్ సంస్థానాధీసులు మహావీర ప్రతాప్ ద్వితీయ విశ్వంబర దేవ్ పాలిస్తున్న కాలంలో దట్టమైన అటవీ ప్రాంతాలైన నీలావడి, కుంభికోట, పుల్‌కోన తదితర ప్రాంతాల్లో ఆదిమ తెగకు చెందిన దొరలు నివసిస్తుండేవారు. ఆ సమయంలో నీలావడిలో క్రూరమృగాల బారినపడి ఎంతోమంది ప్రతిరోజూ చనిపోతుండేవారు. దీనిని అరికట్టాలని రాజును ప్రజలు వేడుకున్నారు. ఈ క్రమంలో క్రూరమృగాలను అంతమొందించి ప్రజలను రక్షించేందుకు రాజు తన సైన్యంతో అడవిలోకి వెళ్తాడు. అయితే వీరిపై క్రూరమృగాలు దాడి చేస్తాయి. అనంతరం అలసిన రాజు, అతని సైన్యం ఒక ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటారు. అనుకోకుండా ఆ సమయంలో విపరీతమైన గాలివాన రావడంతో సైన్యం అంతా చెల్లాచెదురవుతుంది. రాజు అతి కష్టం మీద ఒక చెట్టును పట్టుకొని ఉండిపోయి ప్రాణాలను కాపాడుకుంటాడు. అయితే ఆకలి, దప్పిక కారణంగా బాధపడుతున్న రాజుకు ఒక బాలిక కనిపించి తాగేందుకు నీరు, తినేందుకు ఆహారం ఇస్తుంది. అనంతరం ఆ బాలిక వల్ల తన ప్రాణాలు దక్కాయని భావించిన రాజు ఆ బాలికను తన రాజ్యానికి తీసుకెళ్తాడు. ఆపద సమయంలో కాపాడిన ఆ బాలికే అగ్ని గంగమ్మగా పేరొందిందని స్థల పురాణం చెబుతుంది. ఆనాటి నుంచి అమ్మవారిని కొలిచేవారు దొరలే. ఆదిమ తెగకు చెందిన వీరంతా అమ్మవారికి సేవకులుగా పనిచేస్తున్నారు.



సేవకురాలు శకుంతల హుయిక



సేవకుడు నారాయణ నాయక్

వసతి సముదాయానికి భూమిపూజ



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ తదితరులు



భూమిపూజ చేస్తున్న ఎంపీ రమేష్ మజ్జి తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాజువీధిలో ఉన్న గణేష్ మందిరం ప్రాంగణంలో అయ్యప్ప భక్తుల వసతి సముదాయానికి గురువారం భూమిపూజ జరిగింది. డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి తన కోటా నిధులలో రూ.5 లక్షలు అందజేశారు. నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, రాష్ట్ర ప్రత్యేక డవలప్‌మెంట్ కౌన్సిల్ సలహాదారుడు ప్రదీప్ కుమార్ మజ్జి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానీ భూమిపూజ చేసి ఇటుకలు వేశారు. వారు తమ కోటా నిధులతో భవనం నిర్మాణానికి సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ మున్సిపల్ చైర్మన్ కును నాయక్, వైస్ చైర్మన్ సౌమ్య మహాపాత్రో, గణేష్ మందిర కమిటీ సభ్యుడు గణేష్ దాస్, అయ్యప్ప భక్తుల కమిటీ సభ్యుడు మాజీ మున్సిపల్ ఈవో వి.వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి యత్నంపై కేసు నమోదు

రాజాం సిటీ: మండల పరిధిలోని వీఆర్‌అగ్రహారం గ్రామానికి చెందిన గెడ్డాపు మోహనరావుపై లైంగికదాడి యత్నం కేసు నమోదుచేశామని ఎస్సై పి.నీలావతి గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లలితకు భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త కూలి పనుల నిమిత్తం రాజాం వెళ్తూ పోషిస్తున్నాడు. ఇదే అదునుగా ఇంట్లో ఒంటరిగా ఉన్న తనను పక్కింట్లో ఉంటున్న మోహనరావు నిత్యం వేధిస్తున్నాడని, ఈ విషయమై పలుమార్లు తన భర్త మందలించినప్పటికీ అతనిలో మార్పురాలేదని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో ఈ నెల 8న ఇంట్లో ఒంటరిగా ఉన్న తన చేయిపట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు దాడిచేశాడని ఫిర్యాదులో వివరించింది. ఈ విషయం గమనించిన చుట్టుపక్కల వారు తన భర్తతో పాటు అత్తమామలకు సమాచారం అందించడంతో వారి సహాయంతో చికిత్స నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రిలో చేరినట్లు బాధితురాలు బుధవారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వ్యాక్సిన్ వ్యాన్లు ప్రారంభం



జెండా ఊపి సంచాలక వ్యాక్సిన్, రక్త సేకరణ వాహనాలను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రవేశపెట్టిన ఇన్సులేటెడ్ వ్యాక్సిన్ వ్యాన్, సంచాలక రక్త సేకరణ వ్యాన్ వ్యవస్థని సీఎం నవీన్ పట్నాయక్ గురువారం నవీన్ నివాస్ నుంచి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నిరంజన్ పూజారి, కార్యదర్శి షాలిని పండిత్, ముఖ్యమంత్రి కార్యదర్శి (5టీ) వి.కె.పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమం లక్ష్యం..

యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం కింద టీకాలతో నివారించగల వ్యాధుల కారణంగా సంభవించే మరణాలు, అనారోగ్యాలను తగ్గించే లక్ష్యంతో ఈ వ్యవస్థని ప్రవేశ పెట్టారు. దీర్ఘకాల నిల్వతో సకాలంలో వినియోగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల దుకాణాలు, ఇతర అనుబంధ కార్యాచరణ కేంద్రాలకు టీకాలు రవాణా చేయడంలో ఈ వ్యవస్థ దోహదపడుతుంది. ఈ లక్ష్య సాధనకు అన్ని స్థాయిల్లో టీకాల ప్రధాన ప్రక్రియ కేంద్రం వరకు టీకాల కోల్డ్ చైన్ వ్యవస్థ నిర్వహించడం ఈ కార్యక్రమంలో భాగమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఒక స్టేట్ వ్యాక్సిన్ స్టోర్, 32 జిల్లా వ్యాక్సిన్ స్టోర్‌లు, వ్యాక్సిన్‌ల సురక్షిత నిల్వ కోసం 1,190 కోల్డ్ చైన్ పాయింట్‌లు పని చేస్తున్నాయి. ఒడిశా రాష్ట్ర ఔషధ కార్పొరేషన్ లిమిటెడ్ ఓఎంసీఎల్ ఒక్కో వ్యాన్‌కు రూ.33.26 లక్షల చొప్పున రూ.3.32 కోట్లు వెచ్చించి, 10 సంచాలక వ్యాక్సిన్ వ్యాన్‌లు కొనుగోలు చేసింది. రాష్ట్ర వ్యాక్సిన్ దుకాణాలు, బాలాసోర్, బోలంగీర్, బరంపురం, భువనేశ్వర్, కటక్, కొరాపుట్, ఫుల్బాణి, సంబల్‌పూర్ ప్రాంతాల్లో 9 ప్రాంతీయ వ్యాక్సిన్ స్టోర్‌ల పరిధిలో వీటిని వినియోగిస్తారు.

మొబైల్ బ్లడ్ కలెక్షన్ వ్యాన్

విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే చర్యలో భాగంగా మారుమూల ప్రాంతాల్లో స్వచ్ఛంద రక్త సేకరణ ప్రేరణకు అధునాతన సౌకర్యాలతో కూడిన 5 సంచాలక రక్త సేకరణ వ్యాన్‌లు ముఖ్యమంత్రి ప్రారంభించారు. మొత్తం 2020 సంవత్సరంలో స్వచ్ఛంద రక్త సేకరణ 89,917 యూనిట్లకు పరిమితం కాగా, 2022 సంవత్సరం నాటికి ఈ పరిమితి 1,26,747 యూనిట్లకు పెరిగింది.

వేర్వేరు సంఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదకర సంఘటనల్లో గురువారం పలువురు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన మేరకు ఆయా సంఘటనలు, మృతుల వివరాలు ఇలా ఉన్నాయి.



బావిలో ఉమ మృతదేహం

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేటకు చెందిన గంటుమాని ఉమ(32) బావిలో తేలియాడింది. గుంటమాని ఉమ, భర్త రాములు మధ్య ఇటీవల తగాదాలు బాగా జరిగిన నేపథ్యంలో అవమానాలు భరించలేక గురువారం గ్రామానికి ఆనుకుని ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే మృతురాలి తల్లిదండ్రులు మాత్రం తమ కుమార్తె ఉమను హత్య చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్ల ఎస్ఐ శిరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన సందీప్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్

బైక్ అదుపుతప్పి యువకుడు..

గుర్ల మండలంలోని చుక్కపేట జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో నెల్లిమర్ల పట్టణానికి చెందిన సిల్లా సోముశేఖర్ (30) అలియాస్ సందీప్ మృతి చెందాడు. నెల్లిమర్లకు చెందిన సందీప్‌తో పాటు స్నేహితులు రాము, పాలూరి గణేష్ ద్విచక్ర వాహనంపై గరివిడి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నెల్లిమర్ల వస్తుండగా చుక్కపేట వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో సందీప్ అక్కడికక్కడే మృతి చెందగా రాము, గణేష్‌లు గాయపడడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. గుర్ల ఏఎస్సై రాజశేఖర్ పట్నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: ద్వారపూడి గ్రామ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గ్రామంలోని షరాబుల వీధికి చెందిన శెనగంశెట్టి తాతారావు (32) మృతి చెందినట్లు శ్రీకాకుళం జీఆర్‌పీ ఎస్సై తెలిపారు. తాను పెంచుకుంటున్న ఆవును వెతుక్కుంటూ తాతారావు వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

లారీ ఢీకొని విద్యార్థి..



మృతుడు పవన్ కుమార్

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలో పాలకొండ-వీరఘట్టం రహదారిలో గల గ్యాస్ గొడౌన్ సమీపంలో లారీ ఢీకొని సంతకవిటి మండలం కృష్ణయ్యవలసకు చెందిన దాసరి పవన్‌కుమార్ (20) మృతి చెందాడు. ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ పాలకొండలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న పవన్‌కుమార్ గురువారం కళాశాలకు వెళ్లాడు. అయితే హాల్‌టికెట్ మరిచిపోవడంతో వసతి గృహానికి వెళ్లి తీసుకుని తిరిగి కళాశాలకు వస్తూ రహదారిపక్కన అగాడు. అదే సమయంలో మితిమీరిన వేగంతో వచ్చిన లారీ పవన్‌కుమార్‌ను బలంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గడ్డి మందు తాగేసిన వివాహిత..



మృతిచెందిన చిన్నమ్మడు

సంతకవిటి: మండలంలోని సోమన్నపేట గ్రామానికి చెందిన పాండ్రంకి చిన్నమ్మడు(52) గడ్డిమందు తాగి అస్వస్థలకు గురి కవడంతో కుటుంబసభ్యులు శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త రామినాయుడు ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్సై జనార్దనరావు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదాన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ నిషాంత్ కుమార్ ప్రారంభించి, రక్తదానం చేసిన విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరొకరి ప్రాణం కాపాడినవారవుతారని, దీనిని అర్థం చేసుకుని ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా బలహీనపడతామనే అపోహను వీడాలని, రక్తదానం చేయడం వల్ల మరింత ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని స్పష్టం చేశారు. వేసవిలో రక్తనిల్వలు తగ్గుతాయని దానిని దృష్టిలో పెట్టుకుని యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, దీని పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రక్తదాన శిబిరంలో అగ్నిమాపక సిబ్బంది, భాస్కర కాలేజ్ డిగ్రీ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.వాగ్దేవి, డాక్టర్.హరిజగన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీఐ గుర్తింపు వచ్చిన వెంటనే ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు వచ్చిన వెంటనే ఎల్ఎల్‌బీ మూడేళ్ల తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. వర్సిటీ రిజస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ బీసీఐ బృందం వర్చువల్‌గా తనిఖీ పూర్తి చేసిందని, కావాల్సిన డాక్యుమెంట్లు అందజేసినట్లు వివరించారు. అనుమతుల కోసం నిరీక్షిస్తున్నట్లు చెప్పారు. వర్సిటీలో ఈ నెల 6న ఇంజినీరింగ్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని. ఈ పరీక్షలు ఈ నెల 21వరకు జరగనున్నాయని అన్నారు.

కోళ్ల మృతిపై విచారణ



కోళ్లు శాంపిళ్లు సేకరిస్తున్న వెటర్నరీ ఏడీలు కిశోర్, లోకనాథం

కోటబొమ్మాళి: మండలంలోని విశ్వనాథపురం పంచాయతీలో ఇటీవల 300 కోళ్లు మృతి చెందిన ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ అంశంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. శ్రీకాకుళం వెటర్నరీ ల్యాబ్ ఏడీ కిశోర్, కోటబొమ్మాళి ఏడీ ఎం.లోకనాథం గురువారం విశ్వనాథ పురం వెళ్లి కోళ్ల మృతిపై విచారణ చేపట్టారు. కోళ్ల యజమానులు, కొండాల శిమ్మయ్య, మేడిబోయిన అప్పన్నలను కలిసి వివరాలు సేకరించారు. కోళ్ల నుంచి శాంపిళ్లు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రగ్న చైతన్య, వెటర్నరీ సహాయకులు కె.మహేష్, ఎస్.శాంతారావు, భానోజీరావు పాల్గొన్నారు.

'అనుభవజ్ఞులకే పనులు అప్పగించండి'



ఎస్ఈ దైవప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ ప్రతినిధులు

అరసవల్లి: కనీస అనుభవం లేని వారికి విద్యుత్ కాంట్రాక్టు పనులను కట్టబెట్టేందుకు టెక్కలి ఈఈ ప్రయత్నిస్తున్నారని, తాజాగా నరసన్నపేటలో ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఉంగటి పాపారావు, త్రా ఈశ్వరరావులు కోరారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎల్.దైవ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. టెక్కలి డివిజన్ పరిధిలోని నరసన్నపేట సెక్షన్‌లో ఇటీవల మంజూరైన పెద్ద పనులకు కొందరు షిఫ్ట్ ఆపరేటర్లు కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనులు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ విషయమై టెక్కలి ఈఈ దృష్టికి కూడా పలుమార్లు తీసుకువెళ్లినా స్పందన రాలేదని కాంట్రాక్టర్ల సంఘ ప్రతినిధులు వివరించారు. కొందరు బినామీలు స్థానిక రాజకీయ నేతల పేర్లు చెప్పి కాంట్రాక్టు పనులకు అగ్రిమెంట్లు చేయించుకుంటున్నారని, ఇందుకు టెక్కలి ఈఈ సహకరిస్తున్నారని, దీనిపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ఎస్ఈ దైవప్రసాద్ స్పందిస్తూ విచారించి తగు చర్యలు చేపడతామన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని పాతనౌపడ గ్రామానికి చెందిన అక్కుదలై దానమ్మ(68) గురువారం ఉరి వేసుకుని మృతి చెందినట్లు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. దానమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. అందులో ఇద్దరు కుమారులు చనిపోయారు. చిన్న కుమారుడు రమేష్‌తో కలిసి ఆమె గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. ఆమెకు ఆరోగ్యం సరిగా ఉండడం లేదు. నిత్యం ఎవరో ఒకరు తోడుగా ఉండాలి. ఈ నేపథ్యంలో కుమారుడు రమేష్ గురువారం బంధువుల ఇంటిలో వివాహానికి వెళ్లాడు. అనంతరం ఇంటిలో ఎవ రూ లేకపోవడంతో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు దీన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

'బాలలు బడిలోనే ఉండాలి'

శ్రీకాకుళం క్రైమ్ : బాలలు బడిలోనే ఉండాలని, బయట పనుల్లో చేరకూడదని ఏహెచ్‌టీయూ ఎస్ఐ లండ వెంకటరావు పేర్కొన్నారు. ఆయన గురువారం శ్రీకాకుళంలోని పీఎస్ఎన్ఎం హైస్కూల్‌లో బాలల హక్కులు-పరిరక్షణ, బాల కార్మికుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలలను పనుల్లో పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎల్‌పీ జాతీయ బాలకార్మిక నిరోధక శాఖ ప్రోగ్రాం మేనేజర్ పెంకి బాలకృష్ణ, ఏహెచ్‌టీయు ఏఎస్ఐ రమణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణ కిరణం



నింగినీ నేలను కలుపుతూ ఓ బంగారు వంతెన నాలుగు నిమిషాల పాటు ప్రజ్వరిల్లింది. ఎవరో గగన వీధి నుంచి గురి చూసి పంపినట్టు ఆకాశదారుల గుండా పయనించిన కిరణమొకటి అరసవల్లి గోపురంపై వాలి.. పక్కచూపులు లేకుండా నేరుగా అరుణ శిల పాదాలను తాకింది. చుట్టుపక్కలకు వెలుగు రేఖలు విస్తరించేలోపుగా.. ఆ కిరణం ఆదిత్యుడి ఆపాదమస్తకాన్ని అభిషేకించి కాలమార్పు జరిగిందని ప్రకటించింది. అరసవల్లి ఆలయంలో గురువారం ఆవిష్కృతమైన ఈ అపురూప స్వర్ణ కిరణ స్పర్శ విన్యాసం భక్తులకు తన్మయత్వానికి గురి చేసింది.

- నాలుగు నిమిషాల పాటు ఆదిత్యుని మూలవిరాట్టును తాకిన కిరణాలు
- తిలకించి పులకించిన భక్తులు
- నేడు కూడా కిరణ దర్శనానికి అవకాశం

అరసవల్లి: ఆదిత్యుని క్షేత్రంలో ఉదయం 6.22 నుంచి 6.26 వరకు తొలి సూర్యకిరణాలు నేరుగా స్వామిని అభిషేకించిన దృశ్యాలను చూసి భక్తకోటి మైమరచిపోయింది. ఏటా ఉత్తరాయణ, దక్షిణాయన కాలమార్పుల్లో ఇలాంటి అద్భుత దృశ్యాలు కనిపిస్తుంటాయి. కిరణ స్పర్శ దర్శనం కోసం వేకువజామున 4 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. సరిగ్గా సూర్యోదయ సమయాన లేలేత కిరణాలు రాజగోపురం మధ్యలోంచి అనివెట్టి మండపం, ధ్వజస్తంభాన్ని తాకుతూ నేరుగా గర్భాలయంలోని స్వామి వారి మూలవిరాట్టును తాకాయి. దీంతో గంటల కొద్దీ వేచి ఉన్న భక్తులు ఆనందంతో పరవశించిపోయారు. కిరణాదిత్యుడిని చూసి తరించిపోయారు. ఈ సారి కిరణ దర్శనానికి వీలుగా కొత్తగా జింక్ బారికేడ్లను ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఏర్పాటు చేశారు. దీంతో దాదాపుగా క్యూలైన్లలో చేరిన వారందరికీ కిరణ దర్శనప్రాప్తి జరిగింది. భక్తుల గోత్రనామాలతో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శుక్రవారం ఉదయం కూడా కిరణ దర్శనానికి అవకాశం ఉందని శంకరశర్మ తెలిపారు.



ఇదే తొలిసారి..

సూర్యనారాయణ స్వామిపై కిరణాలు పడతాయని విన్నాను. ఇప్పుడు తొలిసారిగా చూశాను. ఊహించుకుంటుంటే మిరాకిల్‌లా ఉంది. ఎక్కడో ఉదయించిన కిర ణాలు గర్భాలయంలోకి స్వామి పాదాలను తాకడం అద్భుతమనే చెప్పాలి. ఇలాంటి దృశ్యాన్ని అంతరాలయం నుంచి దగ్గరగా చూడడం నా అదృష్టం. మాటల్లో చెప్పలేని అనుభూతి ఇది.

– కె.సుజాత, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా



కిరణ దర్శనం ఇలా...

నిజంగా అత్యద్భుతమే...

హైదరాబాద్ నుంచి ఈ అద్భుతాన్ని చూడడానికి వచ్చాను. ముందు రోజునే చేరుకుని ఇక్కడే బస చేశాను. తొలిసారిగా కిరణ దర్శనాన్ని కుటుంబసమేతంగా చేసుకున్నాను. నిజంగా స్వామి కరుణించాడు. అద్భుత దర్శనం..అరుదైన అవకాశం కలిగింది. మళ్లీ మళ్లీ చూడాలని ఉంది.

– సీహెచ్ సత్యనారాయణ, హైదరాబాద్.



ఏటా వస్తాం

మేము ఫ్యామిలీ ఫ్రెండ్స్. ఏటా అరసవల్లి కిరణ దర్శనాలకు వస్తుంటాం. ఇప్పటికి నాలుగైదేళ్లుగా మేము ఈ అద్భుత దృశ్యాన్ని చూస్తున్నాం. నిజంగా సూర్యభగవానుడు మాపై కరుణ ఉంచి అద్భుత దర్శనాన్ని ఇస్తున్నాడు. నిజంగా ఇక్కడి ప్రజలు ఎంతో అదృష్టవంతులు.

– డి.కోటేశ్వరరావు(విజయవాడ), ఎ.మునికృష్ణ (తిరుపతి), బి. సత్యత్రివేణి (బిక్కవోలు)



కిడ్నీ బాధితులకు రూ.5లక్షల సాయం

- దానేటి శ్రీధర్ పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్ సేవకు చిరునామాగా మారుతున్నారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో గురువారం ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు డాక్టర్ శ్రీధర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ నిజాయితీ కలిగిన డాక్టర్ ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా వాసులకు అత్యాధునికమైన వైద్యసేవలు అందించేందుకు ఎల్లప్పుడూ తపిస్తానన్నారు. తన వద్దకు ఐవీఎఫ్ చికిత్స కోసం వచ్చే వారికి రూ.70వేలు రాయితీతో చికిత్స అందిస్తానన్నారు. అలాగే రిమ్స్‌లో కిడ్నీ బాధితుల చికిత్స కోసం రూ.5లక్షలు చెక్‌ను అందజేశారు. టీబీ రోగుల కోసం రూ.లక్ష ప్రకటించారు. అలాగే తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు మెడికవర్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. అదేవిధంగా దానేటి శ్రీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు జెమ్స్, న్యూబ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రిలోనే సుమారు 200 మంది ఉచితంగా రక్తదానం చేశారు. అదేవిధంగా నగరంలోని అనాథాశ్రమాలకు రెండు పూటలా ఉచితంగా భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజా ప్రతినిధులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



రూ.5లక్షల చెక్‌ను అందజేస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్

రోడ్డు ప్రమాదంలో ఉల్లి వ్యాపారి దుర్మరణం

టెక్కలి రూరల్: మండలంలోని ఒలియాసాగరం గ్రామ సమీపాన జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలం చాకిపల్లి గ్రామానికి చెందిన పంగ రామారావు(దండు) (40) అనే ఉల్లిపాయల వ్యాపారి దుర్మరణం పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రామారావు ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటారు. రోజూ ఆటోలో ఉల్లి వేసుకుని ఊరూరా తిరుగుతూ విక్రయిస్తుంటారు. అదే క్రమంలో గురువా రం ఉదయం కూడా వరుసకు అల్లుడైన వాన సింహాచలంతో కలిసి ఆటోలో ఉల్లి వేసుకుని పలాస వైపు బయల్దేరారు. సింహాచలం ఆ టో నడుపుతుండగా రామారావు బండి వెనుక భాగంలో కూర్చుని ఉన్నారు. ఒలియాసాగరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో వెనుక భాగంలో కూర్చుని ఉన్న రామారావు తుళ్లి రోడ్డుపై పడిపోగా.. అతడి తలపై నుంచి లారీ వెళ్లిపోయి అక్కడికక్కడే ఊపిరి వదిలేశాడు. ఆటోలో ఉన్న సింహాచలం బయటకు వచ్చి చూసే సరికి రామారావు విగతజీవుడై ఉన్నాడు. ఢీ కొట్టిన లారీ కనిపించలేదు. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న టెక్కలి ఏఎస్ఐ వెంకటరమణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఒక్క అద్దం విరిగి ప్రమాద స్థలంలో పడి ఉండటంతో దాని ఆధారంగా ఆ వాహనాన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ఈ ఘటనపై టెక్కలి ఎస్ఐ రామకృష్ణ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవ పంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లచ్చమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



రామారావు(ఫైల్)



ఘటన స్థలంలో పడి ఉన్న రామారావు మృతదేహం

సమాజంలో స్త్రీల పాత్ర కీలకం

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో మహిళల పాత్ర అనిర్వచనీయమైనదని రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అమృతకుమారి అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో గల సమావేశ మందిరంలో గురువారం ఆర్టీసీ పర్సనల్ అధికారి కృష్ణవేణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించా రు. కార్యక్రమానికి అమృత కుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ అంటే ప్ర జలతో నిత్యం మమేకమైన సంస్థ అని అన్నా రు. ఇందులో మహిళలు ఇటు కండక్టర్లుగా, అటు గృహిణులుగా తమ బాధ్యతను సమర్థంగా, సక్రమంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలు, టెక్కలి, పలాస తదితర డిపోలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీకాకు ళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్) గట్టు త్రిలోకవజ్రం, శ్రీకాకుళం ఒకటో డిపోకు చెందిన కండక్టర్ జి.సత్తమ్మ, శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన కండక్టర్ కె.శాంతమ్మ, పలాస డిపోకు చెందిన కండక్టర్ బి.ఎస్.రాణి, టెక్కలి డిపోకు చెందిన కండక్టర్ ఎస్.విజయలక్ష్మిలను సత్కరించి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

మానవీయ సాంకేతికత అవసరం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



భూకంపాల నుంచి రక్షణకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలో వివరిస్తున్న విద్యార్థి సాయి

టెక్కలి రూరల్: సాంకేతికత ఎంత పెరిగినా మానవీయత లేకపోతే ఫలితముండదని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న యాస్పైర్ 2క 23 సదస్సులో గురువారం ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస జిల్లా పేరును తుడిచివేసేలా సాంకేతిక పరిష్కారాలు చూపేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమను తాము ప్రశ్నించుకుంటేనే ప్రయోగాలు సత్ఫలితాలు ఇస్తాయని హెక్స్‌వేర్ టెక్నాలజీస్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఉన్నతాధికారి సౌగట్ సేన్ అన్నారు. అలానే ట్రైనీ ఐఏఎస్ లక్ష్మీ స్మృతి మాట్లాడుతూ ప్రతి సమస్యకు సాంకేతికత ఓ పరిష్కారం చూపాలని సూచించారు. ఐతమ్ చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యా సంస్థను 2001లో ప్రారంభించామని, నేడు ఎన్నో అద్భుత విజయాలు అందుకుంటోందని తెలిపారు. దేశ, విదేశాల్లో పలు ప్రాంతాలకు తమ విద్యార్థులను పంపించి అక్కడ ఉన్న సాంకేతికతను దత్తత చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పాలకొండకు చెందిన సూరబత్తుల సాయిదీపక్ అనే విద్యార్థి భూకంపాలు ఎక్కువగా వచ్చే ప్రదేశాల్లో ఎలాంటి నిర్మాణాలు ఉండాలో వివరిస్తూ శభాష్ అనిపించుకున్నాడు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ శ్రీనివాసరావు, కో కన్వీనర్ డాక్టర్ పి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంస్థల పరిరక్షణకు కృషి

శ్రీకాకుళం కల్చరల్: క్రైస్తవ సంస్థల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాస్టర్స్ సంఘం చైర్మన్ ప్రతాప్ సింహ కోరారు. స్థానిక క్రిస్టియన్ వర్షిప్ సెంటర్‌లో జి ల్లా నలుమూలల నుంచి వచ్చిన పాస్టర్లు, సంఘ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే సీఎంతో ఈ విషయమై విన్నవించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్, పట్టణ పాస్టర్స్ ఫెల్లోషిప్ అసోసియేషన్ నాయకులు సీనియర్ సిటిజెన్స్ ఫెల్లో షిప్ నాయకులు పాల్గొన్నారు.

ఇల్లు.. ఇటుక.. ఉపాధి

- జిల్లాలో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- అందుకు తగ్గట్టుగా ఇటుక బట్టీల ఏర్పాటు
- వేల మంది కూలీలకు ఉపాధి
- జిల్లాలో 250కిపైగా ఇటుక పరిశ్రమలు



బెండి గేటు ప్రాంతంలో యంత్రాల ద్వారా తయారు చేస్తున్న ఇటుకలు

వజ్రపుకొత్తూరు: పల్లె పొలిమేరల్లో కొత్త ఊళ్లు పురుడు పోసుకుంటున్నాయి. ఉన్న ఊళ్లలో ఇళ్లకు జతగా నూతన వాడల్లోనూ గృహ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఈ సందడి కొత్త ఉపాధి మార్గాలు చూపెడుతోంది. అందులో ఒకటి ఇటుకల పరిశ్రమ. ప్రైవేటు గృహాలతో పాటు జగనన్న కాలనీల పనులు కూడా జోరందుకోవడంతో ఇటుకలకు భారీ డిమాండ్ ఏర్పడింది. అందుకు తగ్గట్టుగానే జిల్లాలో కొత్తగా ఇటుకల బట్టీలు పుట్టుకువస్తున్నాయి. ప్రస్తుతం ఇటుకల పరిశ్రమ సీజన్‌లో జిల్లాలో 75 కోట్ల ఇటుకలను ఉత్పత్తి చేస్తోంది. రూ.450 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరుగుతున్న ఈ పరిశ్రమ వ్యాపారులకే కాకుండా దాదాపు 17,500 మందికి బతుకునిస్తోంది.

బట్టీల తయారీ ఇలా..

జిల్లాలో ఇటుకల తయారీ జోరుగా సాగుతోంది. జిల్లా నుంచే కాకుండా ఒడిశా, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి వచ్చిన వారు ఇక్కడ కూలి పనులు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని వజ్రపుకొత్తూరు, పలాస, నందిగాం, సోంపేట, ఇచ్ఛాపురం, గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో బెండిగేటు, పద్మనాభపురం, చెరుకుపల్లి, పీపీపురం, ఈదుపురం రోడ్డు, పాలవలస గేటు, తండేవలస, జడూరు తదితర ప్రాంతాల్లో దాదాపు 250 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. 2008కి ముందు ఆయా ప్రాంతాల్లో ఒకటి, రెండు బట్టీలు మాత్రమే ఉండగా ఇప్పుడు బాగా పెరిగాయి. ఇటుకల తయారీలో విజయనగరం జిల్లాకు చెందిన వారితో పాటు ఒడిశాకు చెందిన కూలీలు దిట్ట. వ్యాపారులు వారికి స్థానికంగా వసతి సౌకర్యం కల్పించి ఏటా ఈ సీజన్‌లో ఇటుకలు తయారు చేస్తుంటారు. డిసెంబర్‌లో సీజన్ ప్రారంభమై జూన్‌లో ముగుస్తుంది. వ్యాపారులు పంట భూములు, మెట్టు భూములను లీజుకు తీసుకుని అందులో మట్టిని తీస్తారు. మట్టితో పాటు కొబ్బరి పొట్టు, షామిల్లులో దొరికే కర్రపొట్టు, బూడిద, ఊకను మట్టిలో కలిపి బాగా ట్రాక్టర్‌తో డ్రిల్లింగ్ చేసి ముద్దగా చేస్తారు. మట్టి నాణ్యతను పరిశీలించిన మీదట అచ్చులు వేస్తారు. అచ్చు లు ఎండలో బాగా ఆరబెట్టాక ఒకచోట పెద్దగా బట్టీగా(కోటలా) పెట్టి బొగ్గు, ఊక, కర్రలతో కాలుస్తారు. కాల్చిన ఇటుకలను విక్రయిస్తారు. ఇలా ఇటుకల తయారీకి సుమారు నెల రోజుల సమయం పడుతుంది.



కొత్తపేటలో ముమ్మరంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు



ఊపుగా ఇళ్ల నిర్మాణాలు..

జిల్లాలో అర్బన్, రూరల్ ఇళ్ల పథకంలో భాగంగా దాదాపు నలభై వేలకు పైచిలుకు ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఊళ్లలో ప్రైవేటుగా నిర్మిస్తున్న ఇళ్లు వీటికి అదనం. వీటికి దాదాపు రూ.50 కోట్ల మేర ఇటుకలు అవసరమవుతాయి. దీంతో ఆయా ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, లారీలు ద్వారా ఇటుకలను కొనుగోలు చేసి నిర్మాణాలకు తరలిస్తున్నారు.



తేలికవైతే బెటర్

జిల్లాలో 2010కి ముందు బరువుతో కూడిన ఇటుకలు తయారు చేసే వారు. ప్రస్తుతం వాటితో పాటు తేలిక రకం ఇటుకలు కూడా ఎక్కువగా తయారు చేస్తున్నారు. ప్రధానంగా బెండిగేటులో యంత్రాలతో తయారయ్యే ఇటుకల పరిశ్రమ ఉంది. ఇది నాణ్యమైన ఇటుకలకు ప్రసిద్ధి. చిమ్నీ ఏర్పాటు చేసి మరీ ఇటుకలను కాలుస్తారు. ఎనిమిది గంటలు కరెంటు ఉంటే రోజుకు 25వేల ఇటుకలను ఇక్కడ తయారు చేస్తారు. ఈ ఇటుకలు నాణ్యమైనవిగా భావించి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, పాలకొండ, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చి ఇటుక రూ.5.50 నుంచి రూ.6.50 వరకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇటుకలకు డిమాండ్ పెరుగుతుండడంతో పాటు పెట్టుబడులు కూడా అధికమయ్యాయని నిర్వాహకులు చెబుతున్నారు. బొగ్గు టన్ను గతంలో రూ. 3వేలు ఉండగా ప్రస్తుతం రూ.6వేలు అయ్యింది. ఊక టన్ను రూ.3వేలు నుంచి రూ.5వేలకు పెరిగినట్లు చెబుతున్నారు. జిల్లాలో భూముల ధరలు పెరిగిపోవడంతో భూములను పరిశ్రమలకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, ప్రస్తుతం ఎకరా పొలంలో మట్టి కొనుగోలు చేసేందుకు రూ.90వేలు వరకు వెచ్చించాల్సి వస్తోందని అంటున్నారు.

నిర్మాణాలు బాగా పెరిగాయి



జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు బాగా పెరిగాయి. కోవిడ్‌కు ముందు చాలా కష్టకాలం నడిచింది. ప్రస్తుతం జగనన్న కాలనీలు, ప్రైవేటు ఇళ్ల నిర్మాణాలు వేగం కావడంతో ఇటుకల పరిశ్రమ గాడిన పడింది. ఇళ్ల బిల్లులు కూడా ప్రభుత్వం వేగంగా చెల్లించేస్తోంది.

– అనంత రెడ్డి, డీఈ గృహ నిర్మాణ శాఖ, పలాస

ఐదేళ్లుగా పనిచేస్తున్నా..



నేను ఐదేళ్లుగా ఇటుకల పరిశ్రమలోనే పని చేస్తున్నాను. మాది ఒడిశాలోని ఝూర్సిగూడ. బెండిగేటుతో పాటు జిల్లాలో మాలా వేల మంది పనిచేస్తున్నారు. ఇదే మాకు ఉపాధి. రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తాం. వానా కాలంలో మా సొంత ఊళ్లకు వెళ్తాం. ప్రస్తుతం రోజుకు 25వేల ఇటుకలు వరకు తయారు చేస్తున్నారు.

– రుషికేశ్వర్, ఇటుకల బట్టీ కార్మికుడు